# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 10 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## ప్రభుత్వ ఉద్యోగులకు
# రూ.1.02 కోట్ల ప్రమాద బీమా

- 5.14 లక్షల మంది ఉద్యోగ కుటుంబాలకు లబ్ధి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**బలగం టీవీ, హైదరాబాద్:**

రాష్ట్ర ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులందరికీ రూ.1.02 కోట్ల ప్రమాద బీమా సౌకర్యాన్ని అమలు చేయనున్నట్లు డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షమానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం, ప్రభుత్వ సంక్షమ-అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ చేరవేస్తున్న ఉద్యోగులను తమ కుటుంబ సభ్యుల్లా భావిస్తోందని పేర్కొన్నారు. రూ.1.02 కోట్ల ప్రమాద బీమా అమలు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్రంలోని ప్రముఖ బ్యాంకర్లతో నిర్వహించిన సంప్రదింపులు విజయవంతంగా పూర్తయ్యాయని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ

మిగితా 4వ పేజీలో

## నీళ్ల పేరుతో గొడవలు కాదు
# తెలుగు జాతి ప్రయోజనాలే లక్ష్యం




- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు
- 2027 మార్చిలోగా 'పోలవరం' పూర్తి
- ఏపీ సీఎం చంద్రబాబు
- రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ

**బలగం టీవీ, అమరావతి**

సముద్రంలో కలిసే నీళ్ల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య అనవసర వివాదాలు ఎందుకు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. తనకు గొడవలు అవసరం లేదని, తెలుగు జాతి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఆ నీటిని తెలంగాణ కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వివాదాల వల్ల ఎలాంటి లాభం ఉండదని, కొందరు కావాలని నీళ్ల అంశాన్ని వివాదంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల పేరుతో కూడా అనవసర రాద్ధాంతం చేస్తున్నారని పేర్కొన్నారు.

తొలుత రాయవరం గ్రామంలో రీసర్వే చేసిన పంట భూములను పరిశీలించిన సీఎం, అనంతరం రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేశారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. రీసర్వే పూర్తైన 6,688 గ్రామాల్లోని భూములకు సంబంధించి 22.33 లక్షల పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఏటా మూడు వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని, అందులో 300 టీఎంసీల నీటిని వినియోగించుకుంటే నష్టం ఏమీ లేదన్నారు. పట్టిసీమ నిర్మించి కృష్ణా డెల్టాలో నీటిని వినియోగించుకుందామంటే అప్పట్లో వ్యతిరేకించారని గుర్తుచేశారు. కృష్ణా డెల్టాలో నీళ్లను పొదుపు చేసి శ్రీశైలం నుంచి రాయలసీమకు తరలించే ప్రణాళిక ఉందన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టును పీపీపీ విధానంలో నిర్మిస్తే సమర్థిస్తారని, అదే విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మిస్తే అభ్యంతరం చెబుతున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ట్రిబుల్ ఇంజన్ కూటమి ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. జగ్గన్నపేట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండగగా ప్రకటించినట్లు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు సంప్రదాయమని, అయితే జూదాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ జి. హరీష్‌మాథూర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. దేశంలోకొచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వచ్చాయని పేర్కొన్నారు. ట్రిబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ తరహాలో ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గుంతలు లేని రహదారులను తయారు చేస్తున్నామని, రెండు రోజుల్లోనే 40 కిలోమీటర్ల రోడ్డు వేసి రికార్డు సృష్టించామని తెలిపారు. ట్రూ డౌన్ పేరుతో విద్యుత్తు బిల్లుల భారం తగ్గించామన్నారు. రూ.4,500 కోట్లు పెంచుకోమని ఇఆర్‌సి అనుమతి ఇస్తే, ప్రజాప్రయోజనాల దృష్ట్యా వద్దని చెప్పామని తెలిపారు. భవిష్యత్తులోనూ కరెంటు ఛార్జీలు పెంచబోమని మరోమారు స్పష్టం చేస్తున్నామన్నారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు పేరిట సుపరిపాలన అందించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. జగ్గన్నపేట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండగగా ప్రకటించామన్నారు. సంక్రాంతికి కోడి పందేలు సంప్రదాయమే కానీ, జూదాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ జి.హరీష్‌మాథూర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలు వద్దు..
# నీళ్లే కావాలి

- రాష్ట్రాల మధ్య సహకారం ఉంటేనే అభివృద్ధి..
- నదీ జలాలపై కూర్చొని మాట్లాడుకుందాం
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- ఫార్మా రంగంలో తెలంగాణ నెంబర్ వన్
- బల్క్ డ్రగ్స్ తయారీ 40 శాతం తెలంగాణలోనే
- సీఎం రేవంత్ రెడ్డి
- సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో సీఎం



**బలగం టీవీ, హైదరాబాద్:**

నదీ జలాల విషయంలో పక్క రాష్ట్రాలతో వివాదాలు కోరుకోవడం లేదని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నదీ జలాలకు సంబంధించి పంచాయతీ కావాలా..! నీళ్లు కావాలా..! అని అడిగితే తెలంగాణ రాష్ట్రానికి నీళ్లు కావాలని కోరుకుంటామని చెప్పారు.నదీ జలాలపై రాజకీయ ప్రయోజనం పొందాలని ప్రభుత్వం భావించడం లేదని, రాజకీయాలకు అతీతంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని ఈ-సిటీలో నెలకొల్పిన సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ జల వివాదాలను ప్రస్తావించారు. "పక్క రాష్ట్రాలతో తెలంగాణ వివాదాలను కోరుకోవడం లేదు. న్యాయస్థానాల ముందుకు లేదా మరెవరి వద్దనో పంచాయతీ పెట్టుకునే కన్నా సమస్యపై కూర్చొని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. నీటి వివాదాల విషయంలో తెలంగాణ శాశ్వత పరిష్కారం కోరుకుంటోంది. అభివృద్ధి సాధించాలంటే పక్క రాష్ట్రాల సహకారం, సయోధ్య ఉండాలి. రాజకీయాలకు అతీతంగా పరిష్కారం కోసం అందరూ సహకరించాలి.." అని పక్క రాష్ట్ర ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టించరాదని ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి విజ్ఞప్తి చేశారు. జల వివాదాలపై శాశ్వత పరిష్కారం, రాష్ట్ర ప్రయోజనాలపై వివాదాలను కోరుకోవడం లేదని, సమస్యల పరిష్కారం కోసం సహకరించాలని కోరారు.

ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాల వల్ల పర్యావరణం, సీడబ్ల్యూసీ నుంచి సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన నిధులు, అనుమతులు కూడా రావడం లేదని, తద్వారా రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. రాజకీయ ప్రయోజనాలకన్నా ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసం ఆలోచన చేస్తున్నామని, పరస్పర సహకారం అవసరమని అన్నారు. పోర్టు కనెక్టివిటీ లేని తెలంగాణకు మచిలీపట్నం పోర్టుతో కనెక్టివిటీ కోసం 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ వే, రైల్వే కనెక్టివిటీతో సహా అనుమతి అడిగామని, ఆ కనెక్టివిటీని అభివృద్ధి చేయాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమని చెప్పారు.

అలాగే, ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి చెందాలంటే తెలంగాణ సహకారం అవసరం ఉంటుందని, పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతో పరస్పర సహకారాన్ని మాత్రమే కోరుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వెళ్లాలని, చర్చల ద్వారా సమస్యల సంపూర్ణ పరిష్కారం కోసం ముందుంటామని అన్నారు.

తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ మూడు భాగాలుగా అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశిస్తూ గ్లోబల్ సమ్మిట్ లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశామని వివరించారు. తెలంగాణ ప్రపంచంలో జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూయార్క్ లతో పోటీ పడాలని సంకల్పించామని, అందులో భాగంగానే యువ పారిశ్రామిక వేత్తలు ప్రారంభించే పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రపంచ నగరాలతో పోటీ పడే విధంగా ఐటీ, ఫార్మా, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్, డేటా సెంటర్స్ వాటిల్లో పోటీ పడగలుగుతున్నాం. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ప్రైవేటు రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రం అభివృద్ధి సాధించడానికి పారిశ్రామిక, విద్యుత్, పర్యాటక, దేవాదాయ, వైద్య రంగాల్లో ప్రభుత్వం పాలసీలు తీసుకొచ్చిందని, విద్యా రంగంలోనూ సరికొత్త పాలసీని ప్రకటించబోతున్నాం. పెట్టుబడులను ఆకర్షించడానికి పారదర్శకమైన ప్రణాళికలు రూపొందించాం. భారత్ ఫ్యూచర్ సిటీ వల్ల ఇక్కడి భూముల ధరలు పెరుగుతాయి. అభివృద్ధికి అందరూ సహకరించాలి. అందరి సహకారం ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుంది. 1995 నుంచి 2025 వరకు 30 ఏళ్ల నిరంతర శ్రమ వల్ల హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడుతోందని ముఖ్యమంత్రి చెప్పారు. జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో దక్షిణ భారత దేశంలోనే ఐవీ ఫ్లూయిడ్స్ తయారీకి సంబంధించి సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రశంసించారు.

సుజెన్ మెడికేర్ ఐవీ ఫ్లూయిడ్స్ ఉత్పత్తి యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, శాసనమండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి లతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఒడియన్ మాల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 4వ పేజీలో

# 28 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

## ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర ప్రభుత్వం



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28న ప్రారంభం కానున్నాయి. కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. సమావేశాల ప్రారంభ రోజైన జనవరి 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుమారు రెండు గంటల పాటు ప్రసంగించనున్నారని తాత్కాలిక షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

**ఆర్థిక సర్వే 30న**

జనవరి 29న బీటింగ్ రీట్రీట్ వేడుకల నేపథ్యంలో ఉభయ సభలు సమావేశం కావు. జనవరి 30న జరిగే సమావేశంలో ఆర్థిక సర్వేను పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. జనవరి 31న కూడా రెండు సభలు సమావేశం కావు.

ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌పై ధన్యవాద తీర్మానంపై చర్చలు జరుగుతాయి. ఈ ప్రక్రియ అనంతరం ఫిబ్రవరి 13న పార్లమెంట్ దాదాపు నెల రోజుల పాటు వాయిదా పడనుంది.

**మార్చి 9న తిరిగి సమావేశం**

పార్లమెంట్ మార్చి 9న తిరిగి సమావేశమై ఏప్రిల్ 2న గురువారం రోజున ముగియనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ వెల్లడించింది.

# మంచిగా సదువుకోండి.. బిడ్డ!



- పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం..
- మరోసారి దాతృత్వాన్ని చాటుకున్న కేసీఆర్.
- ప్రమాదవశాత్తూ తండ్రులను కోల్పోయిన ఇద్దరు బడుగు బిడ్డలకు కేసీఆర్ భరోసా..
- బీటెక్ ఇంజనీరింగ్ చదువు పూర్తి కోర్సుకు ఫీజు చెల్లింపు.. విడివిడిగా చెక్కులు అందజేత..

**బలగం టీవీ, హైదరాబాద్**

విద్యుత్ ప్రమాదంలో ఇటీవల మరణించిన ఎర్రవెల్లి గ్రామ నివాసి పేద రైతు చిన్నరాజు సత్తయ్య కుమారుడు, స్థానిక ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న నవీన్, అదే గ్రామానికి చెందిన, ప్రమాదవశాత్తూ కొన్ని సంవత్సరాల క్రితం మరణించిన మరో పేద రైతు పెద్దోళ్ల సాయిలు కొడుకు, బీటెక్ చదువుతున్న అజయ్‌లను చేరదీసి వారి ఇంజనీరింగ్ చదువు పూర్తికాలపు ఫీజులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెల్లించారు. వారికి అవసరమయ్యే పుస్తకాలు, కంప్యూటర్ల కోసం కూడా ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు వారికి విడివిడిగా చెక్కులు అందించారు.

"కష్టపడి మంచిగా చదువుకోండి బిడ్డా.. మీరు కష్టపడి గొప్ప స్థాయిని చేరుకోవాలి. ఫీజుల కోసం భయపడొద్దు. ఏ సమస్య వచ్చినా నేనున్నా.." అంటూ భరోసా నిస్తూ కేసీఆర్ ఆశీర్వదించారు. కాగా.. విద్యుత్ ప్రమాదంలో మరణించిన చిన్నరాజు సత్తయ్య కుటుంబానికి సంబంధిత విద్యుత్ శాఖ నుంచి చట్టపరంగా అందే ఆర్థిక తదితర సాయం గురించి పర్యవేక్షించి వారికి న్యాయం జరిగేలా చూడాలని తన వ్యక్తిగత కార్యదర్శి నాగేందర్ రెడ్డిని కేసీఆర్ ఆదేశించారు.

కాగా.. కుటుంబ పెద్దను కోల్పోయిన తమను గుర్తించి, ఆదరించి, ఆర్థికంగా ఆదుకుని, తమ పిల్లల చదువు, భవిష్యత్తు గురించి ఆలోచన చేసిన కేసీఆర్ కి పిల్లల తల్లులు చేతులెత్తి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. తమ చదువుకోసం భరోసాగా నిలిచిన కేసీఆర్ కి ఎర్రవెల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉర్దూ యూనివర్సిటీ భూములపై కాంగ్రెస్ కన్ను



- విద్యాసంస్థల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం:
- విద్యార్థుల పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- విద్యార్థులతో సమావేశం

**బలగం టీవీ, హైదరాబాద్**

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయన యూనివర్సిటీ విద్యార్థులు సమావేశమయ్యారు. యూనివర్సిటీకి అప్పగించిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడాన్ని విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఈ సందర్భంగా కేటీఆర్‌కు వివరించారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

హైదరాబాద్‌కు తలమానికంగా ఉన్న దేశంలోని ఏకైక ఉర్దూ యూనివర్సిటీని నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. విశిష్టమైన విద్యాసంస్థను రియల్ ఎస్టేట్ అవసరాల కోసం ఉపయోగించాలనే దురుద్దేశంతో 50 ఎకరాల యూనివర్సిటీ భూమిని అక్రమంగా తీసుకునే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు.

రాష్ట్ర ప్రభుత్వం సీరియల్ కిల్లర్ల మాదిరిగా సీరియల్ ల్యాండ్ స్నాచర్‌గా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అన్ని యూనివర్సిటీల భూములను గుంజుకోవడమే ఒక విధానంగా మారిందన్నారు. ముందుగా అగ్రికల్చర్ యూనివర్సిటీ భూమిని హైకోర్టు పేరిట చెప్పి తీసుకున్నారని, ఆ తర్వాత 400 ఎకరాల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూమిని కబ్జా చేయాలని ప్రయత్నించారని గుర్తు చేశారు.

మిగితా 4వ పేజీలో

# సినిమా టికెట్ ధరల పెంపుపై హైకోర్టు ఆగ్రహం

- టికెట్ ధరలు పెంచబోమని మంత్రి స్వయంగా ప్రకటించినా మెమోలు ఎందుకు జారీ చేస్తున్నారు..?
- 'ది రాజాసాబ్' సినిమాకు హోంశాఖ మెమో రద్దు

**అధికారులపై ఆగ్రహం**




**బలగం టీవీ, హైదరాబాద్**

'ది రాజాసాబ్' సినిమా టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ హోంశాఖ జారీ చేసిన మెమోను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. నిబంధనలకు విరుద్ధంగా టికెట్ ధరలు పెంచేందుకు అనుమతులు ఇస్తున్నారంటూ న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. హోంశాఖ కార్యదర్శికి టికెట్ ధరల పెంపునకు సంబంధించి మెమో జారీ చేసే

మిగితా 4వ పేజీలో

## కళాశాలకు ఆలస్యంగా వచ్చిందని విద్యార్థినిని ఎండలో నిల్చోబెట్టిన లెక్చరర్లు

- మెదడులో రక్తం గడ్డ కట్టి విద్యార్థిని మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**




క్లాస్‌కు ఆలస్యంగా వచ్చిందని లెక్చరర్లు విద్యార్థినిని ఎండలో నిల్చొబెట్టడమే కాకుండా తిట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థిని మెదడులో రక్తం గడ్డ కట్టి మృతి చెందింది. ఈ విషాదకర ఘటన హైదరాబాద్‌లోని మారేడ్‌పల్లిలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మారేడ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వర్షిణి(17) గురువారం కళాశాలలో నిర్వహించే పరీక్షకు ఆలస్యంగా వెళ్లింది. దీంతో ఫిజిక్స్ లెక్చరర్ శ్రీలక్ష్మి, ఇంగ్లీష్ లెక్చరర్ మధురిమ ఆమెను తరగతి గదిలోకి అనుమతించలేదు. అంతేకాకుండా తోటి విద్యార్థులందరి ముందే ఆ విద్యార్థినిని వ్యక్తిగతంగా దూషించి.. ఎండలో నిలబెట్టారని విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనతో తీవ్ర మానసిక వేదనకు గురైన వర్షిణి కళాశాల ముగిసిన అనంతరం సోదరితో కలిసి మల్కాజిగిరిలోని తన ఇంటికి వెళ్లగానే కుప్పకూలిపోయింది. గమనించిన తల్లిదండ్రులు ఆమెను వెంటనే మల్కాజిగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న విద్యార్థిని పరిస్థితి

మిగితా 4వ పేజీలో

## డీజీపీ శివధర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

- మధ్యంతర పిటిషన్ కొట్టివేత..
- నాలుగు వారాల్లో రెగ్యులర్ డీజీపీ నియామకం పూర్తి చేయాలని ఆదేశం

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా బి.శివధర్‌రెడ్డి నియామకానికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయన నియామకాన్ని రద్దు చేయాలంటూ దాఖలైన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో రెగ్యులర్ డీజీపీ నియామక ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నియామక ప్రక్రియకు సంబంధించిన కౌంటర్ దాఖలు చేయాలని సూచిస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది.

డీజీపీగా శివధర్‌రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ సామాజిక కార్యకర్త టి.ధన్‌గోపాలరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ప్రకాశ్‌సింగ్ కేసులో ఇచ్చిన తీర్పు ప్రకారం డీజీపీ నియామక ప్రక్రియ జరగలేదని పేర్కొంటూ, శివధర్‌రెడ్డిని నియమిస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. డీజీపీ పదవీ విరమణకు మూడు నెలల ముందే యూపీఎస్సీకి ప్యానెల్ జాబితా

మిగితా 4వ పేజీలో

## పంచాయతీ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో

# మున్సిపల్ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయాలి

- 2 సంవత్సరాలు పట్టణాల్లో ఒక్క రూపాయి కూడా కాంగ్రెస్ ఖర్చు చేయలేదు
- పంచాయతీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పాలనను తిరస్కరించాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న బీఆర్ఎస్
- వరుసగా జిల్లాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్న కేటీఆర్
- జిల్లాలోని మున్సిపాలిటీల వారీగా పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేస్తున్న కేటీఆర్
- హైదరాబాదులో కరీంనగర్ ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశం
- నేడు ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల వారీగా సమావేశం నిర్వహించనున్న కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ దిశానిర్దేశం మేరకు వచ్చే మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే ప్రక్రియకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రీకారం చుట్టారు. వరుసగా జిల్లాల వారీగా మున్సిపల్ ఎన్నికల సమావేశాలను నిర్వహిస్తున్నారు. నిన్న వరంగల్ జిల్లాతో పాటు నేడు కరీంనగర్ జిల్లాకు సంబంధించిన జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులతో ముఖ్య నేతలతో ప్రత్యేకంగా సమావేశమై వచ్చే పురపోరులో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం గురించి విస్తృతంగా చర్చించారు.

ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, అడ్డదారులు తొక్కినా 4,000 పైచిలుకు గ్రామ పంచాయతీలు బీఆర్ఎస్ గెలవడం రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి స్పష్టమైన సంకేతమని కేటీఆర్ అన్నారు. 24 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని, అన్ని రంగాల్లో కుప్పకూలిన పరిపాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్ పార్టీ పైన తీవ్ర ఆగ్రహంతో ఉన్నదని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. రేవంత్ చేతకాని పాలనతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారని చెప్పడానికి ఈ ఫలితాలే ప్రత్యక్ష సాక్షమని, వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి ఇంతకన్నా పెద్ద ఎదురుదెబ్బ తప్పదని కేటీఆర్ స్పష్టం చేశారు. కేవలం రెండు సంవత్సరాల్లోనే అధికార పక్షంపైన ఇంత తీవ్రమైన వ్యతిరేకత రావడం ఎప్పుడూ చూడలేదని కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ ఫలితాలు అనంతరం మన పార్టీ అనేక సవాలను ఎదుర్కొని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిని దాటుకొని.. కాంగ్రెస్ ప్రభుత్వం పైన నిరంతర పోరాటం చేస్తూ మరోసారి ప్రజల మనసును చురగొన్నదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనతో విసిగిపోయిన ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారన్నారు.

పంచాయతీ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికలకు సర్వసన్నద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రజలు కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ప్రజలు పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేశారని, మరోసారి రాష్ట్ర ప్రజానీకం పల్లెలు, పట్టణాలకు అతీతంగా మన పార్టీ వైపు చూస్తున్నారని కేటీఆర్ అన్నారు. పార్టీ శ్రేణులంతా శక్తి వంచన లేకుండా గులాబీ జెండాకు పూర్వ వైభవం తెచ్చేందుకు సరిహద్దుల్లో పనిచేసే సైనికుల్లాగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గత 24 నెలలుగా పట్టణాల్లో నెలకొన్న సమస్యలను ప్రజల ముందు ఉంచాలని కేటీఆర్ పార్టీ నేతలను కోరారు. పారిశుధ్యం నుంచి మొదలుకొని వీధీదీపాల వరకు అన్ని అంశాల్లో కాంగ్రెస్ పార్టీ చేతులెత్తేసిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, రేవంత్ పాలనలో పట్టణాల్లో కొత్తగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, మున్సిపాలిటీలు సమస్యలకు కేరాఫ్ గా మారాయని మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నిధులకు పనులకు తిరిగి శిలాఫలకాలు వేయడం తప్పించి రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ చేసిన ఒక్క పని కూడా లేదన్నారు. సుమారు దశాబ్ద కాలం పాటు బీఆర్ఎస్ హయాంలో పట్టణ ప్రగతితో పురపాలికల రూపురేఖలు మారిపోయాయని, ప్రతి మున్సిపాలిటీని గ్రోత్ ఇంజన్లు గా తీర్చిదిద్దామని గుర్తు చేశారు. పట్టణ ప్రగతితో పాటు ప్రతి మునిసిపాలిటీలో అవసరమైన అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని, వీటిని ప్రజలకు గుర్తు చేయాలన్నారు.

ఈరోజు హైదరాబాద్లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నేతలు హాజరయ్యారు. కరీంనగర్ బీఆర్ఎస్ కోట అని, రెండున్నర దశాబ్దాలుగా అన్ని ఎన్నికల్లో పార్టీ వెంట కరీంనగర్ ప్రజానీకం నిలబడ్డారన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు తమ పరిధిలో ఉన్నటువంటి మునిసిపాలిటీలు కార్పొరేషన్ లో పార్టీపరంగా ఉన్న మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతను తెలియజేశారు. ఇప్పటికే ప్రతి వార్డు డివిజన్ వారీగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు నేతలు కేటీఆర్ కి తెలియజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాల పైన కేటీఆర్, నేతలకు దిశానిర్దేశం చేశారు.

# అప్పట్లో ద్రోహులని అన్నవారికే ఇప్పుడు కాంట్రాక్టులా..?

### బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్



**బలగం టీవి, హైదరాబాద్**

2023కు ముందు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు రకరకాల అసత్య ఆరోపణలు చేశారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ విమర్శించారు. తెలంగాణ భవన్లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ సమయంలో వ్యాపారులు, కాంట్రాక్టర్లు కేసీఆర్, కేటీఆర్లతో అనుబంధాలు కలిగి ఉన్నారని రేవంత్ రెడ్డి పదే పదే ఆరోపించేవారని గుర్తు చేశారు. తమ బంధువులకు, తెలంగాణ ద్రోహులకు కేసీఆర్, కేటీఆర్లు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆరోపిస్తూ డజన్ల కొద్దీ ప్రెస్మీట్లు నిర్వహించారని చెప్పారు.

అయితే ఈస్ట్ ఇండియా కంపెనీగా విమర్శించిన సంస్థలకే ఇప్పుడు రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కేపీసీ (కేసీ పుల్లయ్య కంపెనీ)పై గతంలో పదే పదే విమర్శలు చేసిన రేవంత్, ప్రస్తుతం అదే కంపెనీకి వందల కోట్ల ప్రాజెక్టులు కట్టబెట్టారని విమర్శించారు. అంబేడ్కర్ విగ్రహం, అమర జ్యోతి ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని అప్పట్లో ఆరోపించిన రేవంత్, ఇప్పుడు అదే కేపీసీకి కేటీపీఎస్ 400 కోట్ల ప్రాజెక్టు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కేపీసీ సంస్థ అధినేత అనిల్ కుమార్ శెట్టి రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డికి సన్నిహితంగా ఉన్నందుకే ఈ ప్రాజెక్టు దక్కిందా అని నిలదీశారు.

**పాత స్క్రిప్ట్ -- కొత్త పాత్రలు**

గతంలో ఫీనిక్స్ గ్రూప్ను కేటీఆర్కు దగ్గరగా ఉందని విమర్శించిన రేవంత్, ఇప్పుడు అదే ఫీనిక్స్ సంస్థతో సన్నిహితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రేవంత్ పాత స్క్రిప్ట్ను ఇప్పుడు కవిత తిరగదోడుతున్నారని వ్యాఖ్యానించారు.

అప్పట్లో కేసీఆర్, కేటీఆర్లపై చేసిన ఆరోపణలపై రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే అప్పటి ఆరోపణలపై విచారణ జరిపించాలని, ఇప్పుడు అదే వ్యక్తులు, సంస్థలకు కాంట్రాక్టులు ఇవ్వడం ద్వారా అప్పటి ఆరోపణలు నిరాధారమని ఒప్పుకోవాలని కోరారు. "ముఖాలు మారాయి.. విమర్శలు పాతవే. అప్పట్లో తెలంగాణ ద్రోహులని అన్నవారికే ఇప్పుడు కాంట్రాక్టులు ఎందుకు ఇచ్చారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి" అని మన్నె క్రిశాంక్ స్పష్టం చేశారు.

## గుజరాత్‌లో వరుస భూకంపాలు

**బలగం టీవి, హైదరాబాద్**

గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్ర ప్రాంతంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు 12 సార్లకు పైగా భూప్రకంపనలు సంభవించడంతో రాజ్కోట్ జిల్లాలో భయాందోళనలు నెలకొన్నాయి. గంటల వ్యవధిలోనే పలుమార్లు భూమి కంపించడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. చాలామంది భద్రత కోసం బహిరంగ ప్రదేశాల్లోనే ఉండిపోయారు.అయితే ఈ భూకంపాల వల్ల ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. భూప్రకంపనల తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.6 నుంచి 3.8 మధ్య నమోదైనట్లు వెల్లడించారు.

## ఈ నెల 21న కోడెల పంపిణీ..

- చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలి..
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఈ నెల 21వ తేదీన వేములవాడ తిప్పాపూర్ లోని గోశాలలో కోడెలను పంపిణీ చేయనున్నట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ గోశాలలోని 300 కోడెలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, పరిసర జిల్లాల రైతులు అర్హులని స్పష్టం చేశారు. కోడెల కోసం 1.5 నుంచి 5 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న సన్నకారు, చిన్నకారు రైతులు అర్హులని, వారు వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ వెబ్సైట్ https://rajannasircilla.telangana.gov.in/ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు

ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న రైతులు దానికి సంబంధించిన పత్రాలతో ఈ నెల 21 వ తేదీన (బుధవారం) ఉదయం 09.00 గంటలలోగా వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ గోశాలకు ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకంతో రావాలని తెలిపారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని స్పష్టం చేశారు.

జియో ట్యాగింగ్ ఉన్న కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని స్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని, వ్యవసాయ అవసరాలకే వినియోగించాలని సూచించారు. పక్కదారి పట్టినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు.

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ భాస్కర్



**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ను గురువారం రోజున మర్యాదపూర్వకంగా కలిశారు.



## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన సుంకె రవిశంకర్.

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామ పంచాయితీ వర్కర్ ఎదురుగట్ల మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో చనిపోగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపి, ఆర్థిక సహాయం చేసిన చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలోని వెల్జిపూర్ గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ తాత నాయిని రాజిరెడ్డి ఇటీవల అనారోగ్యం తో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఐరెడ్డి చైతన్య మహేందర్ రెడ్డి వీరితో పాటు అనంతగిరి సర్పంచ్ అరుకాల నవీన్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంకణాల రాంప్రసాద్ రెడ్డి, మండల రజక సంఘం అధ్యక్షులు బొల్లారం పరశురాములు, వెల్జిపురం ఉప సర్పంచ్ కంకణాల శ్రావణి నరేష్ రెడ్డి, బొజ్జ శ్రీనివాస్ పందిళ్ళ యాదగిరి సోనవేని పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ మీద నుంచి కింద పడి వ్యక్తి మృతి

- డ్రైవర్ అజాగ్రత్తగా నడిపాడని కేసు నమోదు
- మండల ఎస్సై రమాకాంత్



**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడ గ్రామానికి చెందిన బత్తిని దేవయ్య (45) ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే మానువాడ గ్రామానికి చెందిన బత్తిని దేవయ్య తండ్రి మల్లయ్య తన ట్రాక్టర్ నంబర్ టీఎస్ 16 కేజీ 0087లో మానేరు కాల్వ వద్ద ఇసుక లోడ్ చేసుకొని, డ్రైవర్ వేణుతో కలిసి వెంకట్రావుపల్లి గ్రామం వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ వేణు అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడుపుతూ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో, డ్రైవర్ పక్కన కూర్చున్న దేవయ్య ట్రాక్టర్ మీద నుంచి కింద పడిపోయాడు. అతని మీదుగా ట్రాక్టర్ టైర్ వెళ్లడంతో తీవ్ర గాయాలు కావడంతో, స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం దేవయ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతుని భార్య బత్తిని పుష్ప ఫిర్యాదు మేరకు డ్రైవర్ అజాగ్రత్తగా నడిపాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.



# కత్తితో దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దేశాయిపల్లి శివారులో కత్తితో దాడి జరిగిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సావనపెల్లి శశి ప్రీతమ్ (తండ్రి వెంకటేష్)కు రక్తగాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గండి శ్రీధర్ (తండ్రి పోచయ్య) దేశాయిపల్లి శివారులో శశి ప్రీతమ్‌పై కత్తితో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఈ సంఘటనపై గురువారం వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు సంబంధించి విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ వెంట వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్, బోయినిపల్లి ఎస్ఐ ఎన్. రమాకాంత్ ఉన్నారు.



# రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్‌లతో సంగీతం శ్రీనివాస్ భేటీ..

- సిరిసిల్లలో పార్టీ బలోపేతంపై చర్చ

**బలగం టీవీ, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్ష నటరాజన్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సహాయ ఇంచార్జ్ విశ్వనాథన్ లను రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితి మరియు భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు చేపట్టిన వివిధ కార్యక్రమాలను సంగీతం శ్రీనివాస్ ఇంచార్జ్‌లకు వివరించారు. జిల్లాలో పార్టీ ప్రస్తుత స్థితిగతులు, క్షేత్రస్థాయిలో కేడర్ బలం మరియు ప్రజల్లో పార్టీ పట్ల ఉన్న స్పందనను నివేదించారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై మీనాక్ష నటరాజన్ దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజల్లోకి పార్టీ సిద్ధాంతాలను బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సుంకె రవిశంకర్

**బలగం టీవీ, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామంలో జంగ వెంకటి, ఇటీవల అనారోగ్యం తో చనిపోగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపి, ఆర్థిక సహాయం చేసిన, చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్.

# వేములవాడ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలి..

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న విప్



**బలగం టీవి, హైదరాబాద్**

వేములవాడ మున్సిపల్ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్స్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రానున్న మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు అండగా ఉంటూ సంక్షమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఏకాభిప్రాయంతో సెలెక్ట్ అండ్ ఎలెక్ట్ పద్ధతిలో అభ్యర్థుల ఎంపిక ఉంటుందని చెప్పారు. 28 వార్డులో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడమే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. వేములవాడ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి అవకాశం ఇవ్వాలని ప్రజలను ప్రతి ఒక్కరు కోరాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతఎన్నికలో ఇచ్చిన హామీలను ఒక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని అందులో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,నూతన రేషన్ కార్డులు మంజూరు చేసిందని ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్రంలోని రైతాంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎక కాలంలో 2 లక్షల రైతు రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలో ఏక కాలంలో రుణమాఫీ చేసిన దాకలలు లేవని తెలిపారు. గతంలో బీజేపీ బిఆర్ఎస్ పార్టీలకు అవకాశం ఇచ్చిన వేములవాడ పట్టణాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు..ఒక్క అవకాశం కాంగ్రెస్ పార్టీకి ఇవ్వాలని కోరారు. గత 50 సంవత్సరాలుగా వేములవాడ పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్న చిరకాల కోరిక రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా సాగుతున్నాయి, గత ప్రభుత్వం రాజన్న ఆలయాన్ని అభివృద్ధి కేవలం రంగు రంగుల వీడియోల్లో మాత్రమే చేపట్టారని ఆనాడు కేసీఆర్ రాజన్న తంతల మీద మాట్లాడుతూ నా లగ్గం ఇక్కడే అయ్యింది ఏటా 100 కోట్లు ఇస్తానని రాజన్న భక్తులను మోసం చేసిందన్నారు. కాని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 150 కోట్లతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఆనాడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాజన్న ఆలయ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి రెండు కళ్లలా ముందుకు పోతున్నాం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని వేములవాడలో ఎమ్మెల్యే గా మీ బిడ్డగా ఉనన్నానని నాకు చెయ్యి తిరిగే వారిని మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించి వేములవాడ మున్సిపల్ చైర్మన్ గా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి వేములవాడ అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2015 సంవత్సరంలో తిప్పాపూర్ మూడవ బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి వదిలేశారని కానీ పలు సందర్భంల్లో మూడవ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయినట్లు వీడియోలు తీసుకొని ప్రజలను మభ్యపెట్టారని ఆరోపించారు. ప్రజా పాలన ఏర్పడిన తర్వాత మూడవ బ్రిడ్జి పనులు ప్రారంభం అయ్యాయని త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు.

పట్టణంలో సుమారు 2000 మంది అడుగు జాగా లేని ప్రజలకు స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. 10 కోట్లతో మురుగు నీరు గుడి చెరువు, మూలవాగులో మురికి నీరు కలవకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం అన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి చేస్తున్న క్రమంలో భీమేశ్వర ఆలయంలో భక్తులకు దర్శనాలకు ఏర్పాట్లు చేస్తే కొందరు భక్తులు వస్తారా అని మాట్లాడారని కానీ నేడు గత 3 నెలలుగా లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తున్నారని తెలిపారు.

వేములవాడ ను పర్యటక రంగంలో అభివృద్ధి చేస్తున్నాని మొన్నటి రోజున గుడి చెరువులో బోటింగ్ ఏర్పాటు కోసం 1 కోటి 40 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే నాంపల్లి లో రోప్ వే,ఎయిర్ క్రాఫ్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షస్తున్నారని మంత్రులు త్వరలోనే వేములవాడ వచ్చి పనులను పర్యవేశిస్తరని తెలిపారు. పట్టణంలో 42 కుల సంఘాలకు సుమారు 6 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మీ ఎన్నికల్లో మీ గెలుపు కోసం కష్టపడుతానని తెలిపారు. వెనుకబడిన వేములవాడను అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. ఎన్నికల్లో సమిష్టిగా పని చేసి ప్రతి పక్షలు చేస్తున్న దృష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# నిరుద్యోగులపై లాఠీచార్జి.. నిరంకుశ పాలనకు నిదర్శనం..

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కంచర్ల రవి గౌడ్ ఆగ్రహం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

నిరుద్యోగులు తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతుంటే, వారిపై పోలీసులు లాఠీచార్జి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ట అని నాయకుడు కంచర్ల రవి గౌడ్ మండిపడ్డారు. ప్రభుత్వ అమానుష చర్యను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బిఆర్?ఎస్? పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదు. అధికారంలోకి రాగానే హామీలను గాలికి వదిలేసి యువతను వంచించింది. ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలే సమాధానమా? ఉద్యోగాల కోసం నిలదీస్తున్న యువతకు ఉద్యోగాలు ఇవ్వాల్సింది పోయి, పోలీసులతో కొట్టించడం దుర్మార్గమైన చర్య. ఎన్నికల ముందు "ప్రతి ఇంటికి ఉద్యోగం" అంటూ యువతను ఆశపెట్టిన కాంగ్రెస్ గద్దెనెక్కిన 100 రోజుల్లోనే తమ అనుయాయులకు పదవులు, జాబులు పంచుకుంది తప్ప సామాన్య నిరుద్యోగులను పట్టించుకోలేదని ఆరోపించారు. నిరుద్యోగుల రక్తంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని ఆయన ఘాటుగా విమర్శించారు. నిరుద్యోగులకు తక్షణమే న్యాయం చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రవి గౌడ్ హెచ్చరించారు. ప్రజల పక్షన తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు అరెల్లి వినయ్ కుమార్, అనీష్, ఆదిత్య, విష్ణు, గణేష్, భాను, మహేష్, సాయితేజ, వివేక్, వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# గంభీరావుపేట సర్పంచ్ పద్మ నర్సగౌడ్‌కు ఘన సన్మానం..

- వృద్ధాశ్రమానికి విరాళం అందజేసిన చిలుముల జయవర్ధన్

**బలగం టీవీ, గంభీరావుపేట:**

గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన మల్లుగారి పద్మ నర్సగౌడ్‌ను తెలంగాణ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం, మల్లుగారి నర్సగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి జయవర్ధన్ తన ఉదారతను చాటుకున్నారు. తన తండ్రి రాజనర్సు జ్ఞాపకార్థం వృద్ధాశ్రమ నిర్వహణ కోసం 2500 రూపాయల



ఆర్థిక సాయాన్ని విరాళంగా అందజేశారు. సామాజిక సేవలో భాగంగా నర్సగౌడ్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ పల్లె బాలరాజు, నగునూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో 63 మంది నక్సలైట్ల లొంగుబాటు




**బలగం టీవీ, హైదరాబాద్**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడా జిల్లాలో శుక్రవారం ఏకంగా 63 మంది నక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో 18 మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయిన వారిలో రూ.1.19 కోట్లకు పైగా బహుమతి ఉన్న 36 మంది కీలక క్యాడర్లు ఉండటం గమనార్హం. ఈ విషయాన్ని దంతేవాడా జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ వెల్లడించారు. 'పూనా మార్గెం' (పునరావాసం నుంచి సామాజిక పునఃఏకీకరణ) కార్యక్రమం కింద సీనియర్ పోలీసు అధికారులు, సీఆర్‌పీఎఫ్ అధికారుల సమక్షంలో నక్సలైట్లు లొంగిపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానంతో తాము ఆకర్షితులమయ్యామని నక్సలైట్లు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు.

లొంగిపోయిన నక్సలైట్లు దక్షణ బస్తర్ డివిజన్, పశ్చిమ బస్తర్ డివిజన్, మాడ్ డివిజన్‌తో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో క్రియాశీలకంగా పనిచేసిన వారిగా గుర్తించారు. వీరిలో ఏడుగురిపై ఒక్కొక్కరికి రూ.8 లక్షల బహుమతి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**కీలక నక్సలైట్ల వివరాలు**

లొంగిపోయినవారిలో కలహండి ఏరియా కమిటీ కార్యదర్శి పక్లు అలియాస్ ప్రదీప్ ఓయం (45), డివిజనల్ కమిటీ సభ్యుడు మోహన్ అలియాస్ అజాద్ కడ్తి (32), అతని భార్య సుమిత్ర అలియాస్ ద్రౌపతి చాపా (30), భైరంమడ్ ఏరియా కమిటీ కార్యదర్శి హుంగి అలియాస్ రాధిక లేకమ్ (28), కంపెనీ నంబర్–1 సభ్యుడు సుఖ్రామ్ టాటి (20), కంపెనీ నంబర్–7 సభ్యుడు పండు మడ్కం (19), అదే విభాగానికి చెందిన సోమ్డు కడ్తి (21) తదితరులు ఉన్నారు. ఇతరులలో ఏడుగురిపై రూ.5 లక్షల చొప్పున, 8 మందిపై రూ.2 లక్షల చొప్పున, 11 మందిపై రూ.లక్ష చొప్పున, ముగ్గురిపై రూ.50 వేల చొప్పున బహుమతి ఉంది. ఈ 36 మంది నక్సలైట్లపై మొత్తం రూ.1,19,50,000 బహుమతి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

లొంగిపోయిన 63 మంది నక్సలైట్లకు తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.50 వేల నగదు అందించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ విధానం ప్రకారం పునరావాసం కల్పిస్తామని ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు. ఇటీవల జనవరి 7న సుక్మా జిల్లాలో 26 మంది నక్సలైట్లు లొంగిపోగా, 2025 సంవత్సరంలో ఇప్పటి వరకు రాష్ట్రంలో 1,500 మందికి పైగా నక్సలైట్లు లొంగిపోయారని అధికారులు పేర్కొన్నారు. దేశంలో నక్సలిజాన్ని 2026 మార్చి 31 నాటికి పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు వెల్లడించారు.

# డీజీపీ శివధర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

(మొదటి పేజీ తరువాయి)

పంపాల్సి ఉంటుందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

**యూపీఎస్సీకి పలుమార్లు జాబితా పంపాం : ఏజీ**

ఈ కేసులో అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ గతేడాది ఏప్రిల్ నుంచి ఐదుగురు అధికారుల పేర్లతో కూడిన ప్యానెల్ జాబితాను యూపీఎస్సీకి పంపుతున్నామని తెలిపారు. అయితే యూపీఎస్సీ క్లారిఫికేషన్ కోరుతూ ఆ జాబితాను తిరిగి పంపిందన్నారు. డిసెంబర్ 31న మరోసారి జాబితా పంపగా, సుప్రీంకోర్టు అనుమతి తీసుకోవాలంటూ యూపీఎస్సీ దానిని తిరిగి పంపిందని కోర్టుకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్యానెల్ జాబితాను పరిగణనలోకి తీసుకునేలా యూపీఎస్సీని ఆదేశించాలని ఏజీ కోరారు.

**నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోండి : హైకోర్టు**

యూపీఎస్సీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ సకాలంలో ప్యానెల్ జాబితా అందకపోవడంతోనే దానిని తిరిగి పంపినట్లు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం తెలంగాణ ప్రభుత్వం పంపిన జాబితాను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని యూపీఎస్సీని ఆదేశించింది. పూర్తిస్థాయి డీజీపీ నియామకంపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది. మధ్యంతర పిటిషన్ కొట్టివేయడంతో డీజీపీ శివధర్‌రెడ్డికి తాత్కాలిక ఊరట లభించింది. గత విచారణలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా డీజీపీ నియామకం జరిగిందని పిటిషనర్ వాదించారు. అయితే సీనియర్ స్థాయి అధికారుల పదవీ విరమణ కారణంగా తాత్కాలిక ప్రాతిపదికన శివధర్‌రెడ్డిని డీజీపీగా నియమించాల్సి వచ్చిందని ఏజీ కోర్టుకు తెలిపారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు అమలు కాలేదని పిటిషనర్ భావిస్తే కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని కూడా ఏజీ సూచించారు.

# ఉర్దూ యూనివర్సిటీ భూములపై కాంగ్రెస్ కన్ను

(మొదటి పేజీ తరువాయి)



విద్యార్థుల ఆందోళనలు, ప్రజల వ్యతిరేకత, సుప్రీంకోర్టు జోక్యం వల్లే ఆ వ్యవహారం తాత్కాలికంగా ఆగిందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో పదివేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని సుప్రీంకోర్టు చెప్పినా ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టలేదని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాసంస్థల భూములను తీసుకుని రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. తాజాగా అంతర్జాతీయంగా ప్రఖ్యాతి చెందిన ఐఎస్‌బీ భూములపై కూడా కన్ను వేసిందని తెలిపారు. ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటానికి బీఆర్‌ఎస్ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. అవసరమైతే ఢిల్లీలో కూడా పోరాటం చేస్తామని, ఈ అంశాన్ని రాజ్యసభలో బీఆర్‌ఎస్ పార్లమెంట్ సభ్యులు లేవనెత్తుతారని తెలిపారు. రాబోయే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో యూనివర్సిటీ విస్తరణకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తరపున అందిస్తామని హామీ ఇచ్చారు. మైనార్టీల సంరక్షకుడినని చెప్పుకునే రాహుల్ గాంధీ, ఉర్దూ యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం చేయడమేనా సంరక్షణ అని కేటీఆర్ ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా మైనార్టీ విద్యార్థులు చదువుకుంటున్న యూనివర్సిటీని నిర్వీర్యం చేయడమేనా కాంగ్రెస్ విధానమని నిలదీశారు. గతంలో హైదరాబాద్ నగర ప్రయోజనాల కోసం ఉర్దూ యూనివర్సిటీ 32 ఎకరాలను ఔటర్ రింగ్ రోడ్డు కోసం, కాజాగూడ--నానక్‌రామ్‌గూడ లింక్ రోడ్డు కోసం 7 ఎకరాలను ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రజాప్రయోజనాల కోసం అవసరమైనప్పుడు భూసేకరణను ఎప్పుడూ వ్యతిరేకించలేదన్నారు.

**నిరుద్యోగులపై లాఠీచార్జ్‌ను ఖండించిన కేటీఆర్**

నిరుద్యోగులు, విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతను మోసం చేశారని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు అడిగితే విద్యార్థులపై పోలీసులతో దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగ యువతను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పడం దారుణమని అన్నారు. నిరుద్యోగులు, విద్యార్థుల వెంట బీఆర్‌ఎస్ పార్టీ నిలబడుతుందని, విద్యార్థి విభాగం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# సీఎం ప్రజావాణిలో 472 దరఖాస్తులు

**బలగం టీవీ, హైదరాబాద్**

మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 472 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 120, రెవెన్యూ శాఖకు 29, విద్యుత్ శాఖకు 26, ఇందిరమ్మ ఇండ్ల కోసం 219, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 77 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, రాష్ట్ర నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.



# ఓడియన్ మాల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచ స్థాయి షాపింగ్, డైనింగ్, వినోదాల సమ్మేళనంగా ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఏర్పాటు చేసిన అల్ట్రా ప్రీమియం 'ఓడియన్ మాల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓడియన్ మాల్ డైరెక్టర్ తుల్లా విజయేందర్ గౌడ్ మాట్లాడుతూ ఓడియన్ మాల్ ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌కు ఒక కొత్త అధ్యాయాన్ని తీసుకువస్తుందన్నారు. సినిమా సంస్కృతికి చిరునామాగా నిలిచిన ఈ ప్రాంతంలో మొట్టమొదటి మల్టీప్లెక్స్‌గా ఐనాక్స్ ఆధ్వర్యంలో అత్యాధునిక సినిమా థియేటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ఎండీ అజహరుద్దీన్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ. ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీ పీ. మహేందర్ రెడ్డి, ఓడియన్ మాల్ డైరెక్టర్లు అమర్‌నాథ్ వుప్పలంచ, శాంత శ్రీరామ్ కన్స్ట్రక్షన్స్ ఎండీ నర్సయ్య, పీవీఆర్ సినిమాస్ సీఈఓ ప్రమోద్ అరోరా, సైఫ్ అలీ ఖాన్, నజాఫ్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.02 కోట్ల ప్రమాద బీమా

(మొదటి పేజీ తరువాయి)

కాలంలో ఏర్పడిన బకాయిలను సైతం ప్రతి నెల క్రమం తప్పకుండా దశలవారీగా విడుదల చేస్తూ వస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల సంక్షమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే సింగరేణి, ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, జెన్‌కో సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.కోటికి పైగా ప్రమాద బీమా అమలులో ఉందని భట్టి గుర్తు చేశారు. సింగరేణిలో 38 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులు, విద్యుత్ సంస్థల్లో 71,387 మంది ఉద్యోగులకు ఈ బీమా వర్తిస్తున్నదని తెలిపారు. అదే తరహాలో ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.1.02 కోట్ల ప్రమాద బీమా అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 5.14 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు భద్రత, ఆర్థిక భరోసా లభించనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# కళాశాలకు ఆలస్యంగా వచ్చిందని విద్యార్థినిని ఎండలో నిల్చోబెట్టిన లెక్చరర్లు

(మొదటి పేజీ తరువాయి)

విషమించి మృతి చెందింది. మెదడులో రక్తం గడ్డ కట్టడం వల్లే చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. దీంతో లెక్చరర్ల కారణంగానే వర్షిణి మృతి చెందిందంటూ ఆమె తల్లిదండ్రులు, దళిత సంఘాల నాయకులు శుక్రవారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న విద్యాశాఖ అధికారులు సంబంధిత లెక్చరర్లపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మారేడుపల్లి పోలీసులు తెలిపారు.

# సినిమా టికెట్ ధరల పెంపుపై హైకోర్టు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

అధికారం లేదని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. నిబంధనల ప్రకారం జిల్లా స్థాయిలో కలెక్టర్లు, హైదరాబాద్ పరిధిలో పోలీస్ కమిషనర్ మాత్రమే టికెట్ ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. వాదనలు విన్న హైకోర్టు టికెట్ ధరలు పెంచుతూ ఇచ్చిన మెమోను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**అధికార యంత్రాంగంపై కోర్టు ఆగ్రహం**

ఈ సందర్భంగా అధికార యంత్రాంగం వ్యవహారశైలిపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "తెలివిగా మెమోలు ఎందుకు ఇస్తున్నారు?" అంటూ ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. టికెట్ ధరలు పెంచబోమని సంబంధిత మంత్రి స్వయంగా ప్రకటించినప్పటికీ, ధరల పెంపునకు మెమోలు ఎందుకు జారీ చేస్తున్నారంటూ మండిపడింది. ఎన్నిసార్లు చెప్పినా అధికారుల ఆలోచన ఎందుకు మారడం లేదని ప్రశ్నిస్తూ, మెమో ఇచ్చే అధికారికి నిబంధనలు తెలియవా? అంటూ తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించింది.

సంక్రాంతి కానుకగా విడుదలైన 'ది రాజాసాబ్' సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు అధికారులు అనుమతులు ఇచ్చిన విషయం తెలిసిందే. గురువారం అర్ధరాత్రి తర్వాత ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.105, మల్టీప్లెక్స్‌లలో రూ.132 పెంపునకు అనుమతిచ్చారు. అలాగే 12 నుంచి 18వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.62, మల్టీప్లెక్స్‌లలో రూ.89 వరకు ధరలు పెంచుకునే వెసులుబాటు కల్పించారు. టికెట్ లాభాల్లో 20 శాతం ఫిలిం ఫెడరేషన్‌కు చెల్లించాలని కూడా ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ మొత్తం వ్యవహారంపై హైకోర్టు మెమోను రద్దు చేయడంతో సినిమా టికెట్ ధరల పెంపుపై స్పష్టత రావాల్సి ఉంది.

# సౌదీ జైలులో భర్త విడిపించాలని ప్రజావాణిలో భార్య వినతి

**బలగం టీవీ, హైదరాబాద్**

సౌదీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న తన భర్త మంగలారం సాయి కుమార్‌ను అక్కడి పోలీస్‌లు అరెస్ట్ చేసి జైలులో బంధించారనీ, తన భర్తను విడిపించి స్వదేశానికి రప్పించాలని నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి గ్రామానికి చెందిన మంగలారం శైలజ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం సీఎం ప్రజావాణిలో ఇన్‌చార్జి చిన్నారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే స్పందించిన చిన్నారెడ్డి సౌదీ ఎంబసీ అధికారులతో మాట్లాడి సాయి కుమార్ విడుదల కోసం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రికి సూచించారు.